ఆలయ సేవా కార్యక్రమాలకు ఆర్థికసాయం

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ హరిశ్‌రెడ్డి, శోభ దంపతులు

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 2: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు నిర్మించిన కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సేవా కార్యక్రమాల నిమిత్తం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గండ్ర హరిశ్‌రెడ్డి-శోభ దంపతులు సోమవారం రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే గండ్రకు చెక్కును అందజేశారు. అదే విధంగా 27వ వార్డులో నివాసముంటున్న మేస్త్రీ పున్నం కుమారస్వామి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడడంతో హరీశ్‌రెడ్డి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ 27వ వార్డు అధ్యక్షుడు కవ్వంపల్లి శేఖర్, నాయకులు మల్లేశ్‌యాదవ్, పార్టీ యూత్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించాలి

భూపాలపల్లి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్

మాట్లాడుతున్న జీఎం

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్2: గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచేలా కార్మికులకు అవగాహన కల్పించాలని భూపాలపల్లి సింగరేణి ఏరియా జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెప్టెంబర్ నెల ఉత్పత్తి, ఉత్పాదకతపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆగస్టులో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 2.61 లక్షల టన్నులు పెట్టుకోగా 1.74 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించామన్నారు. సెప్టెంబర్ నెలలో లక్ష్యం 2.48 లక్షల టన్నులు పెట్టుకున్నామని, ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో 283 క్వార్టర్స్ ఖాళీగా ఉన్నాయని, త్వరలో కార్మికులకు కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో ఏజీఎం ఎస్ జ్యోతి, డీజీఎం జే సురేఖ, అధికార ప్రతినిధి కావూరి మారుతి, పీవో శ్రవణ్ కుమార్, డీవైపీఎం గుండు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు లాభాల వాటాను ప్రకటించాలి

గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీజీబీకేఎస్ నాయకులు

టీజీబీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్2: సింగరేణి కార్మికులకు లాభాల వాటా 35 శాతం వెంటనే ప్రకటించాలని టీజీబీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కేటీకే ఓసీ-2 గనిలో బడితల సమ్మయ్య, కేటీకే-1 ఇంక్లైన్ గనిలో ఫిట్ సెక్రటరీ మల్లారెడ్డి, కేటీకే-5 ఇంక్లైన్ గనిలో నరేశ్, కేటీకే- 6 ఇంక్లైన్ గనిలో సురేశ్, కేటీకే- 8 ఇంక్లైన్ పిట్ సెక్రటరీ రాజేందర్ ఆధ్వర్యంలో మేనేజర్లకు వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ఎన్ సదానందం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం

డబ్బులు ఇవ్వడం లేదని పెట్రోల్ పోసుకున్న వైనం

ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న నరేందర్, లావణ్య దంపతులు

ములుగురూరల్, సెప్టెంబర్2: చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట భార్యాభర్తలు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ములుగులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. జాకారానికి చెందిన తోట నరేందర్ నూనె భిక్షపతితో కలిసి కొన్నేళ్లుగా ములుగులో లహరి చిట్‌ఫండ్ పేరుతో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో విభేదాలు రావడంతో నరేందర్‌కు రావాల్సిన డబ్బులు సుమారు రూ. 95 లక్షలు, రెండు ప్లాట్లు ఇవ్వకుండా భిక్షపతి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో భిక్షపతిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పుకొని ఇవ్వకుండా దాటవేస్తూ వస్తున్నాడు. తనకు పెండ్లి కావాల్సిన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, డబ్బుల కోసం తిరగలేక విరక్తి చెంది తన భార్య లావణ్యతో కలిసి చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకునేందుకు పెట్రోల్ పోసుకున్నామని నరేందర్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు బాధిత దంపతులను పోలీస్ స్టేషన్‌ను తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా నరేందర్-లావణ్య దంపతులను పీఎస్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి నూనె భిక్షపతి నుండి రావాల్సిన డబ్బుల వివరాలను పూర్తి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని చెప్పి ఇంటికి పంపించినట్లు తెలిపారు.

గోదావరి తీరం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

వాజేడులో కోతకు గురవుతున్న గోదావరి ఒడ్డు ప్రాంతం

గోదావరి ఉగ్రరూపం

- కాళేశ్వరం వద్ద 7 లక్షల క్యూసెక్కులుగా పారుతున్న నది
- రాత్రి వరకు మరింత పెరిగే అవకాశం
- భక్తులను స్నానాలకు అనుమతించొద్దు: కలెక్టర్
- పేరూరు వద్ద 30 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- కరకట్ట ఏర్పాటు పై దృష్టి సారించని అధికారులు

కాళేశ్వరం వద్ద పారుతున్న గోదావరి నది

కాళేశ్వరం/వాజేడు, సెప్టెంబర్2: కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఉదయం 3 లక్షల క్యూసెక్కులుగా ఉన్న ప్రవాహం సాయంత్రానికి 7 లక్షల క్యూసెక్కులకు చేరుకుంది. 9.80 మీటర్ల ఎత్తు దాటి పారుతూ లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నది. గోదావరి వద్దకు భక్తులను ఎవరినీ అనుమతించకుండా అధికారులు అక్కడే ఉంటూ గస్తీ కాస్తున్నారు. వాజేడు మండలంలోని పేరూరు వద్ద సోమవారం గోదావరి నీటిమట్టం 11.710 మీటర్ల(39 అడుగులు) కు చేరుకున్నట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. దీంతో వాజేడు, పూసూరు బ్రిడ్జి, ఎడ్జర్లపల్లి తదితర గ్రామాల మీదుగా ప్రవహించే గోదావరి పరవళ్లు తొక్కుతున్నది. వాజేడు మీదుగా ప్రవహిస్తున్న గోదావరి వరదల సమయంలో మీటరుకుపైగా ఒడ్డున ఉన్న భూమి కోతకు గురవుతున్నది. దీంతో గ్రామశివారులోకి నీళ్లు వచ్చే ప్రమాదం ఉందని, అధికారులు దృష్టి సారించి కరకట్ట నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్

కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. అనంతరం ముంపు ప్రాంతమైన పుసుకుపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నదని, పరీవాహక, ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. పుష్కరఘాట్ వద్ద గోదావరి నదిలోకి భక్తులు స్నానాలు ఆచరించేందుకు వెళ్లేందుకు అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ సూర్యప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సీడబ్ల్యూసీ సైట్ ఇంజినీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గణపేశ్వరుడికి లక్ష బిల్వార్చన

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గణపురం, సెప్టెంబర్2: మండల కేంద్రంలోని కోటగుళ్లలో శ్రావణ మాస పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని చివరి సోమవారం గణపేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన పూజ చేశారు. ఉదయం గణపతి పూజతో అర్చకులు జూలపల్లి నాగరాజు కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

అడిషనల్ కలెక్టర్‌గా జడ్పీ సీఈవో

ములుగు, సెప్టెంబర్2(నమస్తేతెలంగాణ): ములుగు జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా జడ్పీ సీఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఎం సంపత్‌రావును నియమిస్తూ కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన శ్రీజను ప్రభుత్వం ఇటీవల ఖమ్మం జిల్లాకు బదిలీ చేయగా ఆమె స్థానంలో సంపత్‌రావుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ: ఎన్పీడీసీఎల్ ఎస్ఈ

కృష్ణకాలనీ, సెప్టెంబర్2: భారీ వర్షాల నేపథ్యంలో వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి ఎస్ఈ బీ మల్చూర్‌నాయక్ అన్నారు. సోమవారం విద్యుత్ సరఫరాకు కలిగిన అంతరాయం పనులను పరిశీలించారు. విద్యుత్ అంతరాయం, తదితర సమస్యలు ఉన్నట్లయితే వినియోగదారులు 7901628364 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912, 18004250028 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

వరదల దృష్ట్యా హెలికాప్టర్‌ను ఏర్పాటు చేయాలి

ములుగురూరల్, సెప్టెంబర్2: ములుగు జిల్లాలో వరదల దృష్ట్యా మంత్రి సీతక్క చొరవ తీసుకొని హెలికాప్టర్‌ను అందుబాటులో ఉంచాలని సీపీఎం నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బొగ్గులవాగు వరద ఉధృతిని పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో పంటలు మునిగిపోయాయని, తక్షణమే వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించి పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వరదల నేపథ్యంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముంపు ప్రాంతాల ప్రజలందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గ్రామస్తులు తిరుపతి, శ్రీనివాస్, సన్నీ, రఘు, రాజు, నరేశ్, సాయి, చింటు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్2: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. 17 దరఖాస్తులు వచ్చాయని, క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించేందుకు ఎండార్స్మెంట్ చేశామన్నారు.

చెరువు శిఖం భూములు పరిరక్షించండి

కాటారం: మండల కేంద్రంలోని ఊర చెరువు, ఎర్రగుంట, తిమ్మనకుంట చెరువులతోపాటు మండలంలోని వివిధ చెరువుల శిఖం భూములు కబ్జాకు గురిగాకుండా పరిరక్షించాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిల్ల కిరణ్, నాయకులు జక్కు శ్రావణ్ కలెక్టరేట్ ప్రజావాణిలో ఆర్డీవో మంగీలాల్‌కు ఫిర్యాదు చేశారు.

చెరువు ఆక్రమణపై వినతి

చిట్యాల, సెప్టెంబర్2: మండలంలోని బావుసింగ్ పల్లి గ్రామ శివారులోని లోతకుంట చెరువు ఆక్రమణకు గురవుతున్నదని రైతులు సోమవారం తహసీల్దార్ హేమకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నందరాజు, తిరుపతిరావు, విజేందర్, ఐలయ్య, సురేశ్, రాజునాయక్, సంజీవ్, రాజయ్య పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- నీట మునిగిన పంట పొలాలు
- కొనసాగుతున్న వరద సహాయక చర్యలు

తాడ్వాయి/ గోవిందరావుపేట/ వెంకటాపూర్, సెప్టెంబర్ 2: వాగులు, వంకల్లో వరదనీరు తగ్గుముఖం పట్టింది. తాడ్వాయి మండలం నార్లాపురం, కాల్వపల్లి మధ్యలోని సీసీ రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. జనగలంచ వద్ద జాతీయ రహదారిపై ఉన్న వంతెన పైనుంచి వరదనీరు ప్రవహించడంతో రోడ్డు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. జలదిగ్బంధంలో చిక్కుకున్న కొండపర్తి, ఊరట్టం, ఎల్బాక, పడిగాపురం గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. వరదల తాకిడికి వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి ఇసుక మేటలు వేశాయి. 163వ జాతీయ రహదారిపైన గల జనగలంచ వాగు వరదనీటితో ఉధృతంగా ప్రవహించడంతో రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో పోలీసులు వాహనాలను మేడారం మీదుగా పస్రా నుంచి హనుమకొండకు పంపించారు. వెంగళాపురం వద్ద బాంబుల ఒర్రె కూడా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది కలిసి జనగలంచ వాగును పరిశీలించారు. అనంతరం ఇసుక లారీలను వాగు వద్దకు పిలిపించి డ్రైవర్లు, క్లీనర్లతో కలిసి రోడ్డుపై కంకర, మట్టిని పోసి రెండు రోజులుగా నిలిచి ఉన్న వాహనాలను వాగు దాటించారు. గోవిందరావుపేట మండలంలోని దయ్యాలవాగు బ్రిడ్జి వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఇరువైపులా పొలాలు నీట మునిగాయి. కొందరు రైతుల మోటర్లు సైతం వాగు ఉధృతిలో కొట్టుకుపోయాయి. పస్రా-మంగపేట రాకపోకలను సోమవారం ప్రారంభించారు. ఏటూరునాగారం నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇసుక లారీలు తాడ్వాయి వయా మేడారం మీదుగా పస్రాకు వచ్చేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప సరస్సు నీటి మట్టం 30.8 అడుగులకు చేరుకుంది. లక్ష్మీదేవిపేట, బూర్గుపేట గ్రామాల మధ్య మారేడు గుండ చెరువు వరద ఉధృతితో బూర్గుపేట బీటీరోడ్డు కోతకు గురై కొట్టుకుపోయింది.

మహదేవపూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దంపేట వాగు

తాడ్వాయిలో కుంగిన నార్లాపురం-కాల్వపల్లి సీసీ రోడ్డు

గోవిందరావుపేట మండలం పూట్‌ఫారమ్ గ్రామ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

మహదేవపూర్‌లో భారీ వర్షం

మహదేవపూర్: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కుదురుపల్లి, పెద్దంపేట వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చెట్లు విరిగి పడ్డాయి. రహదారులు జలమయమయ్యాయి. బెగ్లూర్ సమీపంలోని కొంగలవాగు ఉధృతంగా ప్రవహించడంతో రైతుల పంట పొలాలు నీటమునిగాయి.

మండలాల వారీగా వర్షపాతం..

ములుగురూరల్/భూపాలపల్లి రూరల్: ములుగు జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం రాత్రి వరకు 42.2 మి.మీ వర్షపాతం నమోదైంది వెంకటాపూర్‌లో 25.2, ములుగులో 8, మంగపేటలో 33.2, కన్నాయిగూడెంలో 12.4, వెంకటాపురం(నూగూరు)లో 38.4, గోవిందరావుపేటలో 88.6, ఏటూరునాగారంలో 81, తాడ్వాయిలో 2.2 మి.మీ వర్షం కురవగా వాజేడు మండలంలో అత్యధికంగా 91.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వారు తెలిపారు. అదేవిధంగా భూపాలపల్లి జిల్లాలో సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 28.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మహదేవపూర్‌లో 42.2 మి.మీ, మహాముత్తారంలో 42.2, పలిమెలలో 26.8, కాటారంలో 29.4, మల్హార్‌రావులో 8, టేకుమట్లలో 79, మొగుళ్లపల్లిలో 16.4, చిట్యాలలో 16.2, రేగొండలో 34.4 , గణపురంలో 5.4, భూపాలపల్లి మండలంలో 9.8 మి.మీ వర్షం కురిసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000

CHANGE OF NAME

★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ADITH REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR SONS NAME TO MATTA AADITH REDDY.
NT-331741

★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ARADYA SIRI REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR DAUGHTERS NAME TO MATTA AARADHYA SIRI REDDY.
NT-331741

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఏటూరునాగారం: మాట్లాడుతున్న ఏఎస్పీ, పాల్గొన్న నిర్వాహకులు

నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి: కలెక్టర్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్2: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణపతి నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం భూపాలపల్లి కలెక్టర్‌లో ఉత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, మత్స్యశాఖ అధికారి అవినాశ్, అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఆర్డీవో మంగీలాల్, డీఎస్పీలు, సీఐలు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి: ఏఎస్పీ

ఏటూరునాగారం: గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సూచించారు. ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ పలు సూచనలు చేశారు. ఉత్సవ కమిటీలు తమ వివరాలను పోలీసు స్టేషన్లో అందించాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా చూసుకోవాలని కోరారు. రాత్రి పది గంటలు దాటితే మైక్‌లు ఆఫ్ చేయాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, పలు గ్రామాలకు చెందిన నిర్వాహకులు, గ్రామ పెద్దలు చిటమట రఘు, వావిలాల చిన్నఎల్లయ్య, గోపాల్, మల్లయ్య, వంగపండ్ల రవి, కిరణ్‌కుమార్, సతీశ్, అయూబ్, గౌస్ పాషా, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్2: భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా కాటారం గ్రామానికి చెందిన పవిత్రం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ కన్వీనర్ వంగేటి అశోక్ కుమార్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఆర్యవైశ్య మహాసభ సంఘం మండల శాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు శిరుప అనిల్, మహాసభ జిల్లా అధ్యక్షుడు ఐతు రమేశ్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల శాఖ అధ్యక్షులు, వైశ్య సంఘాల నాయకులు పవిత్రం శ్రీనివాస్‌కు పూలబోకేలు ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు.

శ్రీనివాస్‌కు పూలబొకే అందజేసి అభినందిస్తున్న వివిధ మండలాల అధ్యక్షులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఏటూరునాగారం, సెప్టెంబర్ 2: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొంది. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పోచంకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఏఎన్ఎంలు స్వరూప, రాజమణి, సుమలత, జ్యోతి, అరుణ, కల్పన, సరస్వతి ప్రియదర్శిని, స్రవంతి పాల్గొన్నారు.

చేతిపంపుల ఏర్పాటు

వాజేడు, సెప్టెంబర్2: మండలంలోని మొరుమురు గ్రామపంచాయతీలోని ఘణపురం, కొప్పుసూరు, మాస్‌కాలనీ గ్రామాల్లో సోమవారం కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో తాగునీటి కోసం చేతి బోర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ ప్రశాంత్, సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, మండల కోఆర్డినేటర్ గొంది కామేశ్ పాల్గొన్నారు.

ఘణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన చేతిబోరు

రమణక్కపేటలో రాపిడ్ ఫీవర్ సర్వే

మంగపేట సెప్టెంబర్2: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధి రమణక్కపేటలో సోమవారం వైద్యురాలు యమున బృందం రాపిడ్ ఫీవర్ సర్వే జరిపి, డ్రైడే నిర్వహించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వేలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

గణపురం, సెప్టెంబర్2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు ఆయనకు మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఎంజీఎం ఆసుపత్రిలో హెచ్‌వోడీగా పనిచేశారు.

బస్సును ఢీకొట్టిన లారీ

ములుగురూరల్, సెప్టెంబర్2: ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఢీకొన్న ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుంచి ప్రయాణికులతో బయటకు వస్తున్న క్రమంలో ములుగు నుంచి జంగాలపల్లి వైపు వెళ్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ నరేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రూ.10వేల ఆర్థిక సాయం

ఏటూరునాగారం, సెప్టెంబర్2: మండల కేంద్రంలోని ఆకులవారిఘన్‌పూర్‌లో పక్షవాతానికి గురైన వెన్న నర్సయ్యకు బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో దాతల నుంచి విరాళాలు సేకరించి రూ. 10వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు. దాతలకు డోనర్స్ నిర్వాహకుడు వహీద్ కృతజ్ఞతలు తెలిపారు. డోనర్స్ సభ్యులు మల్యాల పవన్, మున్నా, వినోద్, రాజేందర్, నగేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీ

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్2: మండల పరిధిలోని పాత్రాపురం రైతు వేదికలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు రైతు వేదిక గ్రిల్స్ తొలగించి లోపల ఉన్న బ్యాటరీ, ఇన్వర్టర్‌ను దొంగతనం చేశారని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని ఏఈవో శ్యామ్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

చిట్యాల, సెప్టెంబర్2 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భూపాలపల్లి సీడీపీవో అవం